కనుక ఇప్పుడు డబల్ అండర్‌లైన్ చేసుకుంటారు కదా! ఆ తర్వాత ఫలితంలో ఎంత తేడా వచ్చిందో బాప్‌దాదా తర్వాత చెప్తారు. మంచిది.

శ్రేష్ఠలక్ష్యం మరియు లక్షణాలను ధారణ చేసే నలువైపుల ఉన్న తీవ్రపురుషార్థి ఆత్మలకు, సదా తమ మాటను సమయానుసారం నియమంలో ఉంచుకునే మర్యాదాపురుషోత్తమ ఆత్మలకు, సదా మహావీర్ అయ్యి మాయ యొక్క అన్ని రూపాలను తెలుసుకునే జ్ఞానస్వరూప ఆత్మలకు, సదా ప్రతి సెకను ఆనందంలో ఉండే నిశ్చింతాచక్రవర్తులకు బాప్‌దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.

## స్మృతి దినోత్సవం సంధర్భంగా అవ్యక్త బాప్‌దాదా యొక్క మహావాక్యాలు .... 18-1-90

**అవ్యక్త బాప్‌దాదా తన పిల్లలతో అన్నారు -**

ఈరోజు పిల్లలందరి స్నేహి అయిన తల్లి, తండ్రి తమ స్నేహి పిల్లల మనస్సు యొక్క ధ్వని మరియు స్నేహం యొక్క అమూల్య ముత్యాల మాలలను చూసి ఆ స్నేహానికి బదులుగా - సదా సమీపభవ! సమాన సమర్థభవ! సదా సంపన్న సంతుష్టభవ! అనే విశేష వరదానాలను ఇస్తున్నారు. అందరి మనస్సులలో స్నేహం మీ సంకల్పంలోకి రాగానే తీవ్రవేగంతో బాప్‌దాదా దగ్గరికి చేరిపోతుంది. నలువైపుల ఉన్న దేశవిదేశాల పిల్లలందరు ఈరోజు ప్రేమసాగరంలో లీనమై ఉన్నారు. దానిలో కూడా విశేషంగా బ్రహ్మా తల్లి, తన పిల్లలు స్నేహంలో లవలీనమవ్వటం చూసి తను కూడా పిల్లల ప్రేమలో, స్నేహంలో లీనమైపోయారు బ్రహ్మాతల్లికి పిల్లలపై విశేషస్నేహం ఉండేది అని పిల్లలకు తెలుసు, ఇప్పుడు కూడా ఉంది. పాలన చేసే తల్లికి స్వతహాగానే విశేషస్నేహం ఉంటుంది. ఈరోజు బ్రహ్మా తల్లి ప్రతి ఒక్క బిడ్డను చూసి సంతోషిస్తున్నారు - పిల్లల మనస్సులో, బుద్ధిలో, నయనాలలో తల్లి, తండ్రి తప్ప మరెవ్వరు లేరు. పిల్లలందరు ఒకే బలం, ఒకే నమ్మకంతో ముందుకు వెళ్తున్నారు. ఒకవేళ ఎక్కడైనా ఆగినా కానీ తల్లి తండ్రి యొక్క స్నేహమనే చేయి మరలా వారిని సమర్థంగా చేసి ముందుకు తీసుకువెళ్తుంది.

ఈరోజు తల్లి, తండ్రి పిల్లల శ్రేష్ఠభాగ్యం యొక్క పాటలు పాడుతున్నారు. ఈరోజు విశేషంగా సూర్యచంద్రులు వెన్నెముక అయ్యి సితారలను విశ్వమనే ఆకాశంలో ప్రత్యక్షం చేసే రోజు. యజ్ఞ స్థాపన యొక్క ఆదిలో బ్రహ్మాబాబా పిల్లల ముందు తన సర్వస్వాన్ని అర్పణ చేసారు అంటే సర్వాధికారాలను ఇచ్చారు. అలాగే ఈరోజు బ్రహ్మాబాబా పిల్లలకు సర్వశక్తులను అర్పణ చేసారు అంటే సర్వాధికారాలను ఇచ్చారు. ఈరోజు బాబా, తన పిల్లలకు నయనాల ద్వారా మరియు సంకల్పం ద్వారా 'తండ్రిని ప్రత్యక్షం చేసే పిల్లలు' అనే విశేష బహుమతినిచ్చారు. ఈరోజు బాబా ప్రత్యక్ష సాకారరూపంలో చేయించేపాత్ర యొక్క ప్రత్యక్ష రూపాన్ని చూపించారు. బ్రహ్మాబాబా కూడా ఈరోజు ప్రత్యక్షరూపంలో చేయించేతండ్రికి తోడు అయ్యారు మరియు చేసేవారిగా పిల్లలను నిమిత్తం చేసారు. చేసిచేయించే తల్లితండ్రులు తోడు అయ్యారు. ఈరోజు బ్రహ్మాబాబా తన సేవ యొక్క విధానాన్ని మరియు వేగాన్ని పరివర్తన చేసుకున్నారు. ఈరోజు విశేషంగా

Created by Universal Document Converter

బ్రహ్మాబాబా దేహం నుండి సూక్ష్మఫరిస్తా రూపాన్ని ధారణ చేసి ఉన్నతవతనం, సూక్ష్మవతనం యొక్క నివాసీగా అయ్యారు, ఎందువలన? పిల్లలను తీవ్రవేగంతో ఉన్నతంగా చేయడానికి మరియు పిల్లలను ఫరిస్తా రూపంలో ఎగిరింపచేయడానికి. ఇంత శ్రేష్ట, ప్రాముఖ్యమైన రోజు ఈరోజు. ఈరోజు కేవలం స్నేహపూర్వక రోజే కాదు, విశ్వాత్మలు, బ్రాహ్మణాత్మలు మరియు సేవావేగం యొక్క పరివర్తన అనేది డ్రామాలో నిర్ణయించబడిపోయింది, దానినే పిల్లలు కూడా చూస్తున్నారు. విశ్వంలోని ఆత్మల బుద్ధి, బుద్ధివంతంగా అయ్యి , బుద్ధి పరివర్తన అయ్యి సంపర్కంలోకి వచ్చారు, సహయోగి అయ్యారు. బ్రాహ్మణాత్మలలో శ్రేష్ఠ సంకల్పం ద్వారా తీవ్రవేగంతో వృద్ధి జరిగింది. సేవలో తండ్రిని ప్రత్యక్షం చేసే పిల్లలు అనే బహుమతితో విహంగమార్గం యొక్క సేవను ప్రారంభించారు. ఈ బహుమతి సేవకు సహాయపడింది. పరివర్తన జరిగింది కదా! ఇక ముందు సేవలో మరింత పరివర్తనను చూస్తారు.

ఇప్పటి వరకు బ్రాహ్మణాత్మలైన మీరు మీ తనువు, మనస్సుల యొక్క శ్రమతో కార్యక్రమాలు తయారుచేస్తున్నారు, వేదికను తయారుచేస్తున్నారు, ఆహ్వానపత్రాలను ముద్రిస్తున్నారు, విశేష వ్యక్తులను ఆహ్వానిస్తున్నారు, రేడియో వారిని, టి.వి వారిని సహయోగుల్ని చేస్తున్నారు, ధనాన్ని కూడా ఉపయోగిస్తున్నారు కానీ ఇక ముందు మీరు విశేషవ్యక్తులైపోతారు. మీ కంటే గొప్ప వ్యక్తులు ఎవరూ కనిపించరు. తయారైపోయిన వేదికపైకి ఇతరులు మిమ్మల్ని ఆహ్వానిస్తారు. తమ తనువు, మనస్సు, ధనాల ద్వారా సేవ కొరకు వారే అవకాశాన్ని కోరతారు. మీరు శ్రమించరు, మా దగ్గరికి రండి! అని వారే మిమ్మల్ని ప్రార్థిస్తారు. అప్పుడే ప్రత్యక్షత యొక్క ధ్వని ప్రసిద్ధం అవుతుంది మరియు అందరి ధ్యాస పిల్లలైన మీ ద్వారా బాబా వైపుకి వెళ్తుంది; ఇది ఎక్కువ సమయం నడవదు. అందరి దృష్టి బాబా వైపుకి వెళ్ళటం అంటే బాబా ప్రత్యక్షం అవ్వటం మరియు నలువైపుల నుండి జైజై కారాల గంటలు మ్రోగుతాయి. డ్రామాలో ఈ సూక్ష్మ రహస్యం తయారైఉంది. ప్రత్యక్షత తర్వాత అనేకాత్మలు పశ్చాత్తాపపడతాయి, పిల్లల పశ్చాత్తాపాన్ని తండ్రి చూడలేరు అందువలన పరివర్తన అయిపోతుంది. ఇప్పుడు బ్రాహ్మణాత్మలైన మీ ఉన్నతస్థితి సదాకాలికంగా తయారవుతూ ఉంది; మీ ఉన్నతస్థితియే సేవావేదికను ఆహ్వానిస్తుంది. మరియు విశ్వమనే బేహద్ స్టేజ్‌పై జై జై కారాల పాత్ర అభినయిస్తారు. సేవాపరివర్తన గురించి విన్నారు కదా!

బాబా అవ్యక్తమవ్వటంలో డ్రామాలో గుప్త రహస్యం నిండి ఉంది. బ్రహ్మాబాబా కనీసం పిల్లల నుండి శెలవు తీసుకుని వెళ్తే బావుండును అని కొంతమంది పిల్లలు ఆలోచిస్తున్నారు. అలా అయితే మీరసలు శెలవు ఇస్తారా? ఇవ్వరు కదా! అయితే అప్పుడు బలవంతులు ఎవరయ్యారు? అలా శెలవు తీసుకుంటే కర్మాతీతులు కాలేరు. ఎందుకంటే రక్తసంబంధం కంటే ఆత్మిక సంబంధం కోటానుకోట్ల రెట్లు గొప్పది. బ్రహ్మాబాబా కర్మాతీతంగా అవ్వాల్సి ఉంది. లేక స్నేహబంధనలోకి వెళ్ళాలా? బ్రహ్మాబాబా కూడా అంటున్నారు – డ్రామా కర్మాతీతంగా తయారుచేసే బంధనలో బంధించింది అని మరియు బంధించబడింది కూడా ఎంత సమయంలో! సమయం తీసుకుంటే ఇంకా పాత్ర ఉండి ఉండేది. అందువలన సెకనులో ఆట జరిగిపోయింది. పిల్లలకు కూడా తెలియనివ్వలేదు, బ్రహ్మాబాబాకు కూడా తెలియనివ్వలేదు. దీనినే ఓహో డ్రామా ఓహో అని అంటారు. అవును కదా – ఓహో డ్రామా! ఓహో!! అనుకుంటే ఏ సంకల్పం ఉత్పన్నం అవ్వదు. బిందువు

Created by Universal Document Converter

పెట్టేసారు కదా! లేకపోతే ఏం జరుగుతుందో అని పిల్లలు అడుగుతారు. కానీ బాబా కూడా నిశ్శబ్దంగా ఉన్నారు, పిల్లలు కూడా నిశ్శబ్దంగా ఉన్నారు దీనినే అంటారు డ్రామా యొక్క బిందువు అని. ఆ ఘడియలో అయితే బిందువు పెట్టారు కదా! ఆ తర్వాత ఎన్ని ప్రశ్నలు వచ్చినా కానీ ఆ ఘడియలో రాలేదు అంటే ఓహెూ డ్రామా ఓహో అంటారు కదా! బాబా... బాబా... అని పిలిచింది కూడా తర్వాత, మొదట అనలేదు. డ్రామా యొక్క ఈ విచిత్ర నిర్ణయం నిర్ణయించబడింది మరియు నిర్ణయించ బడుతుంది. పరివర్తనాశాలి అయిన డ్రామా, పాత్రను కూడా పరివర్తన చేసేస్తుంది.

ఈ టీచర్స్ అందరిలో ఎక్కువమంది అవ్యక్తరచన. సాకార పాలన తీసుకున్న టీచర్స్ చాలా తక్కువమంది. తీవ్రవేగంతో జన్మించారు, ఎందుకంటే సంకల్పవేగం అన్నింటికంటే తీవ్రమైనది. ఆదిరత్నాలు ముఖవంశావళి మరియు మీరు సంకల్పవంశావళి అందువలనే బ్రహ్మ యొక్క రెండు రచనల గురించి మహిమ చేస్తారు ఒకటి - ముఖవంశావళి, రెండు - సంకల్పం ద్వారా సృష్టి రచన. అందరూ బ్రహ్మ యొక్క రచనే. అందువలనే బి.కె ( బ్రహ్మాకుమారి) అంటున్నారు కదా! శివకుమారి అని పిలుచుకోవటం లేదు కదా! డబల్ విదేశీయులందరు కూడా సంకల్ప రచనే. టీచర్స్ అందరు తీవ్రవేగంతో ముందుకు వెళ్తున్నారా? మీ రచనే తీవ్రవేగంతో జరిగినప్పుడు పురుషార్థం కూడా తీవ్రవేగంతో ఉండాలి కదా! సదా తీవ్రపురుషార్థినేనా లేక అప్పుడప్పుడా? అని సదా పరిశీలించుకోండి. అర్థమైందా! ఎందుకు, ఏమిటి అనే పాటను ఇప్పుడు సమాప్తి చేయండి. ఓహో! ఓహో!! అనే పాటలు పాడండి.

**నలువైపుల ఉన్న స్నేహము మరియు శక్తి సంపన్న శ్రేష్ఠాత్మలందరికీ, సదా బాబాతో పాటు తీవ్రవేగంతో పరివర్తనకు తోడు అయ్యే సమీపాత్మలకు, సదా తమ ఎగిరేకళ ద్వారా ఇతరాత్మలను కూడా ఎగిరింపచేసే నిర్బంధన ఎగిరే పక్షులైన ఆత్మలకు తండ్రిని ప్రత్యక్షం చేసే పిల్లలు అనే బహుమతి ద్వారా స్వయం మరియు సేవలో తీవ్ర వేగంతో పరివర్తన తీసుకువచ్చేవారికి, లవలీన పిల్లలందరికీ ఈ మహత్వపూర్వక మహత్యంతో పాటు తల్లి, తండ్రి యొక్క విశేష ప్రియస్మృతులు మరియు నమస్తే.**

## బ్రహ్మాబాబా యొక్క విశేష అయిదు అడుగులు .... 22-1-90

అవ్యక్త బాప్‌దాదా తన పిల్లలతో అన్నారు -

ఈరోజు విశ్వస్నేహి అయిన బాబా తన విశేష అతిస్నేహి మరియు సమీప పిల్లలను చూస్తున్నారు. పిల్లలందరు స్నేహీలే కానీ ప్రతి అడుగులో తండ్రిని అనుసరించేవారు అతి స్నేహి మరియు సమీప పిల్లలు. నిరాకారి తండ్రి తన సాకారిపిల్లలకు సాకారరూపంలో అనుసరించడానికి సాకార బ్రహ్మాబాబాను పిల్లల ముందు నిమిత్తంగా పెట్టారు, ఈ ఆది ఆత్మ డ్రామాలో 84 జన్మలు, ఆది నుండి అంతిమం వరకు అనుభవం చేసుకుంది, ఇప్పుడు సాకారరూపంలో మాధ్యమమై పిల్లలకు సహజం చేసేటందుకు ఉదాహరణ అయ్యారు. ఎందుకంటే శక్తిశాలి ఉదాహరణను చూసి అనుసరించడం సహజం. కనుక స్నేహి పిల్లలపై స్నేహానికి గుర్తుగా శివతండ్రి బ్రహ్మాబాబాను మీ ముందు పెట్టారు మరియు పిల్లలందరికీ ఇదే శ్రేష్ఠ శ్రీమతం ఇచ్చారు - ప్రతి అడుగులో

Created by Universal Document Converter